రైతుకు అప'కారం'

- రైతన్నలకు నష్టాలు మిగిల్చిన మిర్చి పంట
- తెగుళ్లతో తగ్గిన దిగుబడులు
- గిట్టుబాటు కాని ధరలు
- ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మిర్చి పంట అన్నదాతలను అప్పుల పాలు చేసింది. ఒకవైపు తెగుళ్లతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోగా.. అరకొరగా చేతికందిన మిర్చికి కూడా సరైన ధరలు లేకోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో దిగుబడులను కొనాల్సిన ప్రభుత్వం కూడా అన్నదాతలను పట్టించుకోకపోవడంతో వారి ఆవేదన అంతాఇంతా కాదు.

జూపాడుబంగ్లా: ఈ ఏడాది పండుమిరపకు విపరీతమైన చీడ, పీడలు వ్యాపించటంతో దిగుబడి తగ్గటంతోపాటు గిట్టుబాటు ధరల్లేక అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా,నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 7,500 హెక్టార్లలో పండుమిరపను సాగుచేశారు. ఈ ఏడాది పంట సాగుచేసినప్పటి నుంచి విపరీతమైన బింగి, వైరస్ తెగుళ్ల వ్యాపించటంతో కొంతమంది రైతులు మధ్యలోనే పంటను దున్నేశారు. మరికొంత మంది రైతులు పంటను కాపాడుకొనేందుకు రసాయనిక మందులను పిచికారీ చేయటంతో పాటు ఎకరాకు 10 నుంచి 20 బస్తాల రసాయనిక మందులు వేశారు. పెట్టుబడి పెరిగిపోయి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు వెచ్చించారు. అయినా ఎకరాకు కేవలం 15 నుంచి 20 క్వింటాళ్లకు దిగుబడి మించలేదు. తగ్గిన దిగుబడికితోడు క్వింటాలు కేవలం రూ.8వేల నుంచి రూ.10 వేలు మాత్రమే ధర పలుకుతుండటంతో అప్పులు తీరే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో లేని కొనుగోలు కేంద్రాలు

రైతులు పండించిన పండుమిరపను విక్రయించుకునేందుకు నందికొట్కూరు, ఆత్మకూరు, కర్నూలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవటంతో పంటను విక్రయించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చేసేదిలేక పండించిన పంటను లారీల్లో గుంటూరు మిర్చియార్డుకు తీసుకెళ్లి విక్రయించుకుంటున్నారు. అక్కడ క్వింటాలుకు కేవలం రూ.8వేల నుంచి రూ.10 వేల ధర పలుకుతున్నట్లు తెలిపారు. అందుకుగాను హమాలీలు, లారీ బాడుగలు కలిపి క్వింటాలుకు రూ.1,600 ఖర్చు అవుతున్నట్లు తెలిపారు. మార్కెట్లో క్వింటాలు రూ.10 వేలు అమ్ముడుపోతే ఖర్చులు పోనూ కేవలం రూ.8,400లు గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.


కళ్లంలో ఆరబెట్టిన పండుమిరప

గిట్టుబాటు కాని ధరలు

గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటాలు పండుమిరప రూ.25 వేల నుంచి రూ.30 వేలు అమ్ముడుపోయింది. ఈ ఏడాది కేవలం రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకే ధర పలుకుతుంది. వ్యాపారులు కుమ్మక్కై ధరను మరింతగా తగ్గించి అడుగుతుండటంతో ఆరుగాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోలేక అన్నదాతలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గుంటూరు మిర్చియార్డుకు తీసుకెళ్లి విక్రయించుకుందామంటే అక్కడ కూడా గిట్టుబాటు ధరలు లభించకపోవడంతోపాటు రవాణా ఖర్చులు మరింత భారమవుతున్నాయి.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఆరు ఎకరాల్లో పండుమిరప పంటను సాగు చేశాను. ఈ ఏడాది పంటసాగుచేసినప్పటి నుంచి విపరీతమైన తెగుళ్ల వల్ల పంటదిగుబడి ఎకరాకు కేవలం 12 క్వింటాళ్లు వచ్చింది. దిగుబడి తగ్గటంతో పాటు ధర భారీగా తగ్గింది. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలి.

– వెంకటరమణ, రైతు, పారుమంచాల

కర్నూలులో కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి



కర్నూలులో పండుమిరప కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి గుంటూరు మిర్చియార్డు ధరల ప్రకారంగా కొనుగోలు చేయాలి. నేను నాలుగు ఎకరాల్లో పండుమిరప సాగుచేశాను. దిగుబడి తగ్గటంతోపాటు గిట్టుబాటు ధరల్లేక ఈ ఏడాది పంటనష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి, ధరల్లేకపోవటంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితుల్లేవు.

– చిన్నరంగస్వామి, రైతు, పారుమంచాల

క్లుప్తంగా

ఘనంగా రచయిత్రి మొల్ల జయంతి


మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మహానంది: తొలి తెలుగు కవయిత్రి, ప్రథమాంధ్ర రామాయణం రచయిత మొల్ల జయంతిని గురువారం మహానందిలో ఘనంగా నిర్వహించారు. మహానందిలోని కుమ్మరి శాలివాహన అన్నసత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి శివశంకర్, కోశాధికారి గురునాథ్, ఉపాధ్యక్షుడు తమ్మడపల్లె శివయ్య ఆధ్వర్యంలో స్థానిక శాలివాహన అన్నసత్ర భవనం వద్ద ఉన్న మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె సేవలను కొనియాడారు. ఆమె రచించిన మొల్లరామాయణం ఎంతో ప్రసిద్ధి చెందిందని వారు అభిప్రాయపడ్డారు.

పశుగ్రాసం దగ్ధం

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన రైతు గొల్ల రామకృష్ణకు చెందిన పశుగ్రాసానికి గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. రూ.50 వేలు వెచ్చించి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి కల్లంలో గడ్డివాము వేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఫీల్డ్‌అసిస్టెంట్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

జూపాడుబంగ్లా: హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాటిపాడు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నలింగన్నపై ఉన్న సెస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ పీడీ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీచేసినట్లు గురువారం ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతో లేబర్ బడ్జెట్ పూర్తి చేయలేదనే కారణంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను గత జనవరి 7న అప్పటి పీడీ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్ హైకోర్టును ఆశ్రయించగా విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రస్తుత పీడీ.. చిన్నలింగన్నపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

రూ.1.29 కోట్ల ఎంపీ లాడ్స్ నిధుల మంజూరు

- గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, నందికొట్కూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు రూ.1.29 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఈ నిధులను ఆయా మండలాల్లోని గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. జూపాడుబంగ్లా మండలానికి రూ.34 లక్షలు, కొత్తపల్లి మండలానికి రూ.15 లక్షలు, మిడుతూరు మండలానికి రూ.10 లక్షలు, నందికొట్కూరు మండలానికి రూ.12 లక్షలు, పగిడ్యాల మండలానికి రూ.40 లక్షలు, పాములపాడు మండలానికి రూ.18 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ జోనల్ మేనేజర్ దామోదర్‌నాయుడు, మార్కెటింగ్ మేనేజర్ కిషోర్, హెచ్‌ఆర్ మహేష్, ఏరియా మేనేజర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు


ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాల్లో భక్తులు పోటెత్తారు. నల్లమల పరిధిలో వెలసిన నవనరసింహ క్షేత్రాలు భక్తుల గోవిందా నామస్మరణతో పులకించిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఇష్టదైవానికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దిగువ అహోబిలంలో ఉదయం కాళింగనర్తనోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ప్రహ్లాదవరదస్వామి అశ్వవాహనంపై అదిష్టించి మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

వంతెన నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు


ఎన్‌హెచ్ పీడీ పద్మతో వంతెన నిర్మాణం వద్దని చెబుతున్న ఓ వర్గం ప్రజలు

పాములపాడు: యర్రగూడరూరు గ్రామంలో అండర్‌పాస్ వంతెన నిర్మాణంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వంతెన నిర్మాణం వద్దని కొందరు, నిర్మాణం చేపట్టాలని మరి కొందరు పట్టుపడుతున్నారు. గురువారం నేషనల్‌హైవే పీడీ పద్మ గ్రామానికి చేరుకుని రెండు వర్గాలతో వేర్వేరుగా మాట్లాడారు. అండర్‌పాస్ వంతెన నిర్మాణం వద్దని చెబుతున్న వారి వద్ద గతంలోనే సర్పంచు మంగమ్మబాయి, ఎంపీటీసీ దర్గాబాయి, వంతెన నిర్మాణం కోసం సంతకాలతో రాసిచ్చిన మరి కొందరు గ్రామస్తులు అర్జీని చూపారు. ఈ విషయం ప్రజలు మాట్లాడుతూ వారిరువురు నిరక్షరాష్యులని, ఏమి చెప్పి సంతకాలు చేయించారో తమకు తెలియదని, వంతెన నిర్మాణానికి ఒప్పుకోమని చెప్పారు. అలాగే మరో వర్గం వద్దకు వెళ్లి పీడీ మాట్లాడారు. వంతెన నిర్మాణం లేకపోతే హైవేపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వ్యవసాయ భూములు రోడ్డుకు రెండు వైపులా ఉన్నాయని, అటు ఇటు వెళ్లేందుకు కచ్చితంగా వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం పీడీ ఒక వర్గాన్ని చెట్టుకిందకు పిలిచి వంతెన నిర్మాణం కావాల్సిన వారు చేతులెత్తండని చెప్పగా ఒక వర్గం చేతులెత్తడం ఆమె అక్కడి నుంచి వెళ్లి కారులో కూర్చుంది. అయితే వంతెన నిర్మాణం వద్దని పట్టుపట్టిన సామాన్య ప్రజలు ఆమె వద్దకు వెళ్లగా కనీసం కారు అద్దం కూడా తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఒకరిని మించి ఒకరు మాటలకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుందని గమనించిన ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బందితో రంగప్రవేశం చేసి అక్కడి నుంచి పంపించారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే


సంబరాలు చేసుకుంటున్న ల్యాబ్ టెక్నీషియన్లు

నందికొట్కూరు: ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీఏన్‌జీఓ సంఘం తాలూకా కార్యదర్శి, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్స్ డేను పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ వైద్యశాలలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో డయాగ్నోస్టిక్ సేవలు కీలకమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

కొలతల ప్రకారం పని చేయాలి


మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: కొలతల ప్రకారం పని చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉపాధి కూలీలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్లను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం త్వరగా పనికి వచ్చి త్వరగా పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాలన్నారు. తప్పనిసరిగా పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నీడ కోసం టెంటు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఓ విమలమ్మ ఉన్నారు.

నివాళి

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామంలో బుధవారం అన్నలదాసు ప్రమీలమ్మ (63) అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ గ్రామానికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నిప్పులవాగుకు 620 క్యూసెక్కుల నీరు


కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాక్‌ఇన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 620 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం 3 పంపుల నుంచి 1,100 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోందన్నారు. ఈ నీటిని నిప్పులవాగుతో పాటు తూడిచెర్ల సబ్ చానల్‌కు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు.

సారా క్రయ విక్రయాలకు దూరంగా ఉండాలి

మిడుతూరు: సారా క్రయ, విక్రయాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్‌ఐ జప్రుల్లా సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలూటి గ్రామ రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ ఉషారాణి అధ్యక్షతన నవోదయం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం అమలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సారాతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ


విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేస్తున్న గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 32 మంది పదో తరగతి విద్యార్థులకు గ్రామస్తులు మండడి దొరబాబురెడ్డి, మద్దికుంట మహేష్‌రెడ్డి గురువారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మహానందీశుడి కల్యాణం


మహానందిలో కల్యాణం జరుగుతున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు గురువారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్య కల్యాణోత్సవంలో భాగంగా అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు జనార్దన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పండితులు, అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలను వైభవంగా చేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించి పూజలు చేశారు.

అమ్మవారికి పల్లకీ సేవ


పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు పౌర్ణమి సందర్భంగా గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవ మూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం విశేషపూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పనిభారం తగ్గించాలి


ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఆత్మకూరు: పనిభారం, ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు బాలునాయక్, మీనాకుమారి, శంకర్‌రెడ్డి, లక్ష్మిదేవి, రాజు, మూర్తుజావలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఎంపీడీఓ నాగభూషణంశెట్టికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు తమకు అప్పగించడంతో సెలవు దినాల్లో, పండగ దినాల్లో పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక పనిభారం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నామన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ


ఆలయ పురవీధుల్లో శ్రీశైల గిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళ హారతుల అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్దరామప్ప కొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ట్రాన్స్‌కో ఏఈని నియమించాలి

జూపాడుబంగ్లా: స్థానిక విద్యుత్ ఉపకేంద్రానికి రెగ్యులర్ ఏఈని నియమించాలని రైతులు, విద్యుత్ వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. రెగ్యులర్ ఏఈ లేకపోవటంతో బోర్లు, బావులకు విద్యుత్ కనెక్షన్ల కోసం ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందన్నారు. ఇన్‌చార్జ్ ఏఈ కార్యాలయానికి ఎప్పుడు వస్తాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో ఉన్న ఏఈ బదిలీపై వెళ్లి ఐదు మాసాలైనా రెగ్యులర్ ఏఈని నియమించకపోవటంతో తీవ్ర ఇబ్బందుతు తలెత్తుతున్నట్లు రైతులు, విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై గుండ్ల పోచంపల్లికి చెందిన వీఎస్‌ఎస్ మూర్తి ద్విభాష్యం, బృందం వారి భక్తి సంగీత విభావరి కార్యక్రమం భక్తులను అలరించింది. విఘ్నరాజం భజే, శివ పంచాక్షరి స్తోత్రం, శివాష్టకం, శివుని శిరస్సుపైన తదితర అష్టకాలను, గీతాలను మూర్తి ద్విభాష్యం తదితరులు ఆలపించారు.

హెల్మెట్ ధరించాలి

- డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. గురువారం సాయంత్రం వడ్ల రామాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్స్ రూల్స్ పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తియాప్ గురించి తెలియజేశారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిద్దాపురం చెరువుకు నీరు వచ్చినందున రైతులందరూ సమష్టిగా పంటలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాము, ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పశుపోషణతో ఆర్థికవృద్ధి సాధ్యం


పశుపోషకులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: పశువులు, ఆవులు, జీవాల పోషణతో మెరుగైన ఆర్థికవృద్ధి సాధించవచ్చని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ గోవిందనాయక్, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం పారుమంచాల సచివాలయం వద్ద సర్పంచ్ ప్రకాశం అధ్యక్షతన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆవులు, గేదెలు, ఎద్దులు, జీవాల పోషణభారం పెరిగినందున అధిక పాలదిగుబడినిచ్చే మేలు జాతి ఆవులు, గేదెలను ఎంపిక చేసుకొని వాటిని పోషించుకోవాలన్నారు. పశువులు ఎదకు వచ్చిన వెంటనే కృత్రిమ గర్భాధారణ(ఎద సూదులు) సూదులు వేయించి చూడికట్టించాలన్నారు. రూ.1,350ల విలువైన చూడి ఇంజెక్షన్లు రాయితీపై పశుపోషకులకు రూ.500లకు రెండు ఇంజెక్షన్లు ఇస్తారన్నారు. రెండు ఇంజెక్షన్లకు పశువులు చూడికట్టకపోతే డబ్బు తిరిగి ఇస్తామన్నారు. ఈ ఇంజెక్షన్ల వల్ల 90 శాతం పెయ్య దూడలే పుడతాయన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డీడీ కె.శ్రీనివాసరావు, సెరికల్చర్ డీడీ ఉమామహేశ్వరి, ఏడీ రామాంజనేయనాయక్, పారుమంచాల డాక్టర్ పావనిరెడ్డి, డీఎల్‌డీఏ డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ రాగసంధ్య, డాక్టర్ శృతికీర్తి, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో సిమెంట్ రోడ్డుపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్, వీరన్న కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం పార్టీ పట్టణ కమిటీ బృందం ఏకలవ్యనగర్ కాలనీలో పర్యటించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు.

'ఆలయ దర్శనంపై సర్వే' అంతంత మాత్రమే...!


- భక్తులు వారి సమస్యలను చెప్పుకునే అవకాశం ఎక్కడ?
- వారిచ్చిన నాలుగైదు ప్రశ్నలకే దిక్కు!
- అవినీతి అంశాలు వెలుగులోకి వచ్చేదెలా

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతి ఏర్పాట్లపై దేవదాయశాఖ సర్వే నిర్వహిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో ఆలయాల వద్ద క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసింది. రీజినల్ జాయింట్ కమిషనర్ ఆలయాల వరకు ఆలయ దర్శనంపై భక్తుల నుంచి అభిప్రాయాలు తెలుసుకునేవారు. దీంతో ఈ విధానం అన్ని ఆలయాల్లో అమలు చేయాలనే ఉద్దేశ్యంతో ఆర్‌జేసీ ఆలయాలతో పాటు డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన ఆలయాల వద్ద ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మహానందిలో గురువారం సమాచారం కేంద్రంతో పాటు ప్రధాన పరిసరాల వద్ద దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్యూఆర్ కోడ్ స్కాన్ చిత్రాలను అతికించారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పేరు, మొబైల్ నెంబరు, నియోజకవర్గం, జెండర్, పుట్టినరోజు అడుగుతుంది. తర్వాత ఆప్షన్‌లోకి వెళ్లగా దర్శనం బాగా జరిగిందా, మౌలిక వసతులు ఎలా ఉన్నాయి. అనుకున్న సమయంలోనే దర్శనం అయిందా, లడ్డూ, పులిహోర ప్రసాదాలు ఎలా ఉన్నాయనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఈ విధానం ద్వారా గతంలో కాణిపాకం దేవస్థానానికి మంచి మార్కులు వచ్చినట్లు దేవదాయశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

పేరుకే ఆలయ దర్శనంపై సర్వే

ఎక్కడైనా, ఏ సంస్థ అయినా ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించేందుకు వారు చెప్పదలుచుకున్న వాటిని ఎంటర్ చేసేలా ఆప్షన్ ఉంటుంది. అయితే రాష్ట్ర దేవదాయశాఖ ఏర్పాటు చేసిన దర్శనంపై అభిప్రాయాల సర్వే కార్యక్రమంలో కేవలం ఎండోమెంట్ వారు అడిగిన నాలుగు ప్రశ్నలకే సమాధానం ఇవ్వాల్సి ఉంది. అయితే ఆలయాల్లో ఉన్న అవినీతి, భక్తులకు ఎదురైన ఇబ్బందులు, ఏవైనా ఫిర్యాదులు సమర్పించాలనుకున్నా, సూచనలు, సలహాలు ఇవ్వాలనుకున్నా ఎలాంటి ఆప్షన్ ఇవ్వకపోవడంతో పలువురు భక్తులు స్కాన్ చేసి చూసి నిరాశ చెందుతున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు పునరాలోచించి భక్తులు అభిప్రాయాలు తెలియచేసేలా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా సాఫ్ట్‌వేర్ రూపొందించి చర్యలు తీసుకుంటే ఆలయాల్లో భక్తులకు ఎదురయ్యే సమస్యలను చెప్పుకోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.


సమాచార కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్


ఆలయ దర్శనంపై సర్వే విధానం